## సీఎం కేసీఆర్‌కు పేదలు రుణపడి ఉంటారు



డోర్నకల్, అక్టోబర్ 15: ఎన్నికల మేనిఫెస్టోలో రూ.400కే గ్యాస్ సిలిండర్ అందిస్తానని సీఎం కేసీఆర్ ప్రకటించడం సంతోషంగా ఉన్నది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గ్యాస్ ధరలను విపరీతంగా పెంచి, సామాన్యులపై మోయలేని భారం వేసింది. రాష్ట్రంలో సబ్బండ వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారు. సీఎం కేసీఆర్‌కు పేద కుటుంబాలు రుణపడి ఉంటారు. మూడోసారి కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలి.

–ఎస్‌కే గౌషియా, తోడేళ్లగూడెం

## రైతుల అభివృద్ధికి తోడ్పాటు



కేసముద్రం: పంట పెట్టుబడికి ఎకరానికి రూ.16వేలు రైతుల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తుంది. దేశంలో ఏ ప్రభుత్వం రైతులు, వ్యవసాయ రంగ అభివృద్ధికి సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టలేదు. సీఎం కేసీఆర్ పంట పెట్టుబడి, రైతు బీమా, 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నారు. చెరువులను బలోపేతం చేసి గోదావరి నీటిని విడుదల చేయడంతో భూగర్భ జలాలు పెరిగి ఏడాదికి మూడు పంటలు పండుతున్నాయి. బీఆర్‌ఎస్ మేనిఫెస్టోలో దివ్యాంగులు, వృద్ధుల పింఛన్, ఆరోగ్యశ్రీ పరిధి రూ.15 లక్షలకు పెంచడంతో పేదలకు లబ్ధి కలుగనున్నది.

–మాందాటి వెంకట్‌రెడ్డి, కల్వల

## అందరికీ లబ్ధి చేకూర్చే మేనిఫెస్టో



బీఆర్‌ఎస్ ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టో అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూర్చేలా ఉన్నది. పింఛన్ల పెంపుతో వృద్ధులు, దివ్యాంగులకు ఆర్థిక భరోసా కల్పించేలా ఉన్నది. ఈ మేనిఫెస్టోలో ఉన్న ప్రతి హామీని నెరవేర్చడంతో పాటు మరిన్ని అమలు చేసిన ఘనత కేవలం కేసీఆర్‌దే. మనందరి జీవితాల్లో వెలుగునింపనున్నది.

–వెన్నాకుల శ్రీనివాస్, నెల్లికుదురు





డోర్నకల్: అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాల వేస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ కోటిలింగం

## కలాం ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**జిల్లాలో ఘనంగా జయంత్యుత్సవాలు**

డోర్నకల్, అక్టోబర్ 15: మాజీ రాష్ట్రపతి, భారత రత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మున్సిపల్ వైస్ చైర్మన్ కేశబోయిన కోటిలింగం అన్నారు. ఆదివారం కలాం 92వ జయంతి సందర్భంగా మున్సిపల్ కార్యాలయ అవరణలో అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అబ్దుల్ కలాం ప్రపంచం గర్వించదగిన గొప్ప శాస్త్రవేత్త అన్నారు. యువతకు మార్గనిర్దేశకుడని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకుడు కేశబోయిన వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

మహబూబాబాద్ రూరల్ : భారత దేశాన్ని అగ్ర రాజ్యాల సరసన నిలబెట్టిన ఘనత అబ్దుల్ కలాందని ప్రముఖ సామాజిక వేత్త పరికిపండ్ల అశోక్ అన్నారు. పట్టణంలోని అడ్వకేట్ కాలనీలో కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాపోలు ప్రభాకర్, కొలిపాక వెంకన్న, జనార్దన్, మాలోత్ వెంకన్న, రమేశ్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

దంతాలపల్లి: మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో అబ్దుల్ కలాం అకాడమీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అకాడమీ వ్యవస్థాపకులు చిర్ర సతీశ్, నవీన్, ఓంకార్, శ్రీనివాస్, శివకుమార్, చిర్ర లింగయ్య, మహేశ్, నగేశ్ పాల్గొన్నారు.



మహబూబాబాద్ రూరల్ : చిత్రపటానికి పూలమాల వేస్తున్న అశోక్



దంతాలపల్లి: కలాం చిత్రపటానికి పూలమాల వేస్తున్న సతీశ్

# దుర్గాదేవికి ప్రత్యేక పూజలు

- ప్రారంభమైన దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు
- వాడవాడలా మండపాల ఏర్పాటు
- కొలువుదీరిన అమ్మవారు
- దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్న భక్తులు

నెల్లికుదురు, అక్టోబర్ 15: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవ కమిటీ సభ్యులు జిలాలోని వాడవాడలా మండపాలను ఏర్పాటు చేసి సుందరంగా అలంకరించారు. అమ్మవారి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో డప్పుచప్పుళ్లతో తీసుకొచ్చి మండపాల్లో ప్రతిష్ఠించారు. అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు, కార్యనిర్వహణ సభ్యులు పాల్గొన్నారు.

కురవి: కురవి, సీరోలు మండలాల్లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. స్వస్తిశ్రీ శోభకృతు నామ సంవత్సరం ఆశ్వీయుజ శుద్ధ పాడ్యమి ముహూర్తాన వేదపండితులు భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి ఆలయ ముఖమండపంలో నవరాత్రులను శాస్త్రోయుక్తంగా నిర్వహించగా, ఆలయ కార్యనిర్వహణాధికారి సత్యనారాయణ దంపతులు పూజలను ఆరంభించారు. కురవి బస్టాండ్ సెంటర్‌లో దుర్గాదేవికి బుక్క వీరన్న, చదువుల సాంబయ్య సారథ్యంలో నిర్వహించి పూజల్లో బుడమ రవి, సబిత దంపతులు పాల్గొన్నారు.

**సురేంద్రహైట్స్‌లో..**

మహబూబాబాద్: జిల్లా కేంద్రంలోని సురేంద్రహైట్స్‌లో దేవీ శరన్నవరాతుల్ర సందర్భంగా దుర్గాదేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. నిర్వాహకులు శ్రీరాం శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఉత్సవాల నిర్వహణకు సంబంధించిన అర్చకులు వెంకటరమణ, దుర్గాప్రసాద్, ప్రత్యేక పూజల అనంతరం అర్చకులు విగ్రహాలను అలంకరించి ప్రతిష్ఠించారు. ఒకటి ప్రధాన విగ్రహం, మరొకటి అలంకరణ విగ్రహం, ఇంకోటి ఉత్సవ విగ్రహమని అర్చకులు తెలిపారు. 15న బాలత్రిపురసుందరీ దేవి అలంకరణలో అమ్మవారికి అంకురార్పణ, గోపూజ, ప్రతిష్ఠ పూజలు నిర్వహించినట్లు తెలిపారు.



కురవి: దుర్గాదేవి విగ్రహం వద్ద పూజలు చేస్తున్న భక్తులు



నెల్లికుదురు: రంగనాయకస్వామి ఆలయ ప్రాంగణంలో కొలువుదీరిన అమ్మవారు


డోర్నకల్: డోర్నకల్, చిల్కోడు, గొల్లచర్ల, తోడేళ్లగూడెం గ్రామాల్లో భక్తులు దేవీ నవరాత్రి ఉత్సవాల మండపాలు ఏర్పాటు చేసి దుర్గాదేవి విగ్రహాలను ప్రతిష్ఠించారు. మొదటి రోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

గూడూరు: మండల కేంద్రంలోని సనాతన శివాలయం, ప్రధాన రహదారి పక్కన మండపం నిర్మించి అమ్మవారి విగ్రహాలను ఏర్పాటు చేశారు. దుర్గా బేకరీ యాజమాన్యం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

గార్ల: మండల కేంద్రంలో దుర్గాదేవి విగ్రహాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలుచేశారు. సమత హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపానికి మండ శ్రీను 25 కిలోల బియ్యం అందజేశారు.

గంగారం: మండల కేంద్రంలోని జెజ్జరి వారిగుంపు చైతన్య యువజన సంఘం ఆధ్వర్యంలో దుర్గదేవి ఉత్సవాలు నిర్వహించారు. ప్రధాన పూజరి కాసుల కృష్ణమాచారి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు నైవేద్యం అందించారు. చైతన్య సంఘం కమిటీ సభ్యులు జెజ్జరి కల్యాణ్, వెంకటేశ్, భరత్, సురేశ్, రాము, సారంగపాణి, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

కేసముద్రం: మండల కేంద్రంలోని ఆర్యవైశ్య భవనంలో వాసవిమిత్ర మండలి, కల్వల ఆంజనేయస్వామి దేవాలయంలో దుర్గామాత భక్త మండలి, అర్పనపల్లిలో సెవన్‌స్టార్‌యూత్ ఆధ్వర్యంలో, ఉప్పరపల్లి, ధన్నసరి గ్రామాల్లో దుర్గామాతకు పూజలు చేశారు. మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారు. పూజల్లో చిలంచర్ల సతీశ్, ఓమ సంతోష్, శ్రీరాం చంద్రన్‌కుమార్, తాటికొండ సుగుణసాగర్, మాలె రవి, ఓలం ప్రభుకిరణ్, ప్రకాశ్, బోనగిరి శ్రీధర్, మేకపోతుల మనీశ్ ఉన్నారు.



గార్ల: దుర్గాదేవికి పూజలు చేస్తున్న మాలధారులు

## మహాగాయత్రీదేవి ఆలయంలో పూజలు

మహబూబాబాద్, అక్టోబర్ 15: జిల్లా కేంద్రం శివారులోని మహాగాయత్రీదేవి ఆలయంలో ఆదివారం ఆలయ ప్రధానార్చకుడు వంకోజు జలేంద్రాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా 300 మంది భక్తులు భవాని మాలధరించారు. వారికి ఆలయ ప్రధానార్చకుడు మాలధారణ చేశారు.

## నేడు గ్రీవెన్స్ రద్దు

మహబూబాబాద్, అక్టోబర్ 15: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అధికారులు ఎన్నికల విధుల్లో నిమగ్నమైనందున నేడు నిర్వహించనున్న గ్రీవెన్స్ కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ కే శశాంక ఒక ప్రకటనలో తెలిపారు.



బెల్లం పానకాన్ని ధ్వంసం చేస్తున్న పోలీసులు

## గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు

కొత్తగూడ, అక్టోబర్ 15: మండలంలోని రేన్యతండా, బోరింగ్ తండా గ్రామాల్లోని గుడుంబా స్థావరాలపై ఆదివారం ఎక్సైజ్, పోలీస్‌శాఖల ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. 1400 లీటర్ల బెల్లం పానకం లభ్యమవడంతో ధ్వంసం చేసి, 60 లీటర్ల గుడుంబాను సీజ్ చేసి నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నగేశ్ తెలిపారు. ఎక్సైజ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీ కార్మికులకు సన్మానం

గూడూరు, అక్టోబర్15: గ్రామ పంచాయతీ కార్మికుల సేవలు వెలకట్టలేనివని జడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఖాసీం అన్నారు. ఆదివారం మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా మండలంలోని పాత గూడూరు జీపీ పరిధిలోని కార్మికులను అబ్దుల్ కలాం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'ఆరోగ్యమే మహాభాగ్యమం' లక్ష్యంతో పనిచేస్తున్నామని, ప్రజల ఆరోగ్యాన్ని, పరిసరాలను, గ్రామాన్ని పరిశుభ్రం చేసే జీపీ కార్మికుల సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు భూక్యా బాలు, లక్ష్మణ్‌నాయక్, గోపీనాథ్, మండల వెంకన్న, ప్రభాకర్, వెంకన్న, నర్సింహ పాల్గొన్నారు.



జీపీ కార్మికులను సన్మానిస్తున్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు